సెల్ టవర్ నిర్మాణ పనుల అడ్డగింత

చర్చిస్తున్న ఎస్ఐ, అధికారులు

పోడూరు: మండలంలోని తూర్పుపాలెం, ఆచంట గ్రామాల సరిహద్దు ప్రాంతమైన పడమటిపాలెంలో సెల్టవర్ నిర్మాణం ఆపి ఊరికి దూరంగా చేపట్టాలని రెండు గ్రామాల ప్రజలు కొంతకాలంగా ఆందోళన నిర్వహించి అధికారులకు వినతిపత్రం ఇచ్చిన విషయం విదితమే. శుక్రవారం టవర్ నిర్మాణ పనులను చేపట్టడంతో ఇరు గ్రామాల ప్రజలు ఆందోళన చేపట్టారు. మహిళలు పనులను అడ్డుకుని అక్కడ సామగ్రిని స్థానిక రామాలయం వద్దకు తరలించారు. దీంతో ఉద్రిక్త నెలకొంది. ఎస్ఐ కె.నాగేశ్వరరావు రంగప్రవేశం చేసి ఇరుపక్షాలతో చర్చించారు. స్థానికుల సమ్మతితోనే టవర్ నిర్మాణ పనులు జరుగుతాయని, అప్పటి వరకు ఆపుతామని ఎస్ఐ హామీ ఇవ్వడంతో స్థానికులు ఆందోళన విరమించారు.

పాలకులు మారితే సొమ్ము ఆపేస్తారా..!

గోకులం షెడ్ల లబ్ధిదారుల పరిస్థితి అగమ్యగోచరం
నాలుగేళ్లయినా జమకాని షెడ్ల సొమ్ము
ఉమ్మడి జిల్లావ్యాప్తంగా రూ.12.86 కోట్లు వరకూ బకాయి
కోర్టును ఆశ్రయించిన పలువురు లబ్ధిదారులు

ఉంగుటూరు మండలం గొల్లగూడెంలో గోకులం షెడ్

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

'నా పేరు దాసరి సతీష్. ఉంగుటూరు మండలం గొల్లగూడెం గ్రామం. గత ప్రభుత్వ హయాంలో ఆరు పశువుల షెడ్డు యూనిట్ను గోకులం పథకంలో నిర్మించాను. రూ.లక్షా 80 వేలు రావాల్సి ఉంది. ఎన్ఆర్ఇజిఎస్ వాటా కింద రూ.ఐదు వేలు జమ చేశారు. మిగిలిన సొమ్ము ఇప్పటి వరకూ రాలేదు. నాలుగేళ్లవుతోంది. ఖర్చు పెట్టిన సొమ్ముకు వడ్డీ తడిసి మోపెడైంది. ఇప్పటికైనా ప్రభుత్వం గోకులం షెడ్ల బకాయిలు విడుదల చేసి రైతులను ఆదుకోవాలి.'

'నా పేరు తమ్మినేని శ్రీనివాసరావు. ఉంగుటూరు మండలం ఎ.గోకవరం. గత ప్రభుత్వ హయాంలో రూ.లక్షా 90 వేల యూనిట్లో మినీ గోకులం షెడ్ నిర్మించాను. ఇప్పటి వరకూ డబ్బు జమ కాలేదు. దీనిపై కోర్టును ఆశ్రయించాను. డబ్బు కోసం ఎదురు చూస్తున్నాం.'

పైన పేర్కొన్న సతీష్, శ్రీనివాసరావులే కాదు. గోకులం షెడ్లు నిర్మించుకున్న దాదాపు 2,500 మందికిపైగా పాడి రైతులు తమకు రావాల్సిన సొమ్ము కోసం కళ్లుకాయలు కాసేలా ఎదురుచూస్తున్నారు. నేతలు మారితే ప్రభుత్వం ఇవ్వాల్సిన సొమ్ము ఆపేయడం ఏ విధంగా సమంజసం అంటూ పాడి రైతులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. పశుపోషణను మరింత అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో గత ప్రభుత్వ హయాంలో గోకులం షెడ్ల నిర్మాణాలను చేపట్టారు. రెండు పశువులకు సంబంధించిన షెడ్డు నిర్మాణం చేసుకునే రైతులకు రూ.లక్షా 50 వేలు, ఆరు పశువుల షెడ్డుకు రూ.లక్షా 80 వేలు చొప్పున ఇచ్చేవిధంగా గోకులం షెడ్ల నిర్మాణ పథకం ప్రవేశపెట్టింది. షెడ్ల నిర్మాణం కోసం 2,728 మంది పాడి రైతులు దరఖాస్తులు చేసుకున్నారు. మొత్తం రూ.42.79 కోట్లు వరకూ అంచనా వేసి అధికారులు ప్రణాళికలు రూపొందించారు. ప్రభుత్వం మారేసరికి ఆన్లైన్లో ఎఫ్టిఒ జనరేట్ అయిన లెక్కల ప్రకారం రైతులకు రూ.14.13 కోట్లు వరకూ రావాల్సి ఉంది. దీనిలో లేబర్ ఖర్చుల కింద రూ.కోటి 27 లక్షల వరకూ రావాల్సి ఉండగా, మెటీరియల్ ఖర్చుల కింద రూ.12.86 కోట్లు రైతులకు అందాల్సి ఉంది. ఎన్ఆర్ఇజిఎస్ కింద లేబర్ ఖర్చు కింద ఇవ్వాల్సిన సొమ్ము కొంతమేర వచ్చాయి. మెటీరియల్ ఖర్చుల కింద రావాల్సిన నిధులు రూ.12.86 కోట్లు మాత్రం రైతులకు అందలేదు. వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత మినీగోకులం షెడ్ల నిలిపివేయడంతో ఎఫ్టిఒ జనరేట్ కాని సొమ్ము దాదాపు రూ.28.65 కోట్లు వరకూ ఉన్నట్లు లెక్కలు చెబుతున్నాయి. దీనిలో లేబర్ ఖర్చుల కింద ఇచ్చేది రూ.కోటి 93 లక్షలు వరకూ ఉండగా, మెటీరియల్ ఖర్చు కింద రూ.26.72 కోట్లు వరకూ ఉంది. ప్రభుత్వం గోకులం షెడ్ల బిల్లులు నిలిపివేయడంతో అప్పులు తెచ్చి షెడ్లు నిర్మించిన రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. దీనిపై కొంతమంది రైతులు హైకోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశాలకు అనుగుణంగా సొమ్ము జమ చేస్తున్నట్లు తెలుస్తోంది. కోర్టుకు వెళ్లలేని రైతుల పరిస్థితి ఏమిటో అర్థం కావడం లేదు. రావాల్సిన బకాయిల లెక్కలు చూస్తే గోకులం షెడ్ల విషయంలో రైతులు పెద్దఎత్తున నష్టపోయినట్లు స్పష్టమవుతోంది. ప్రభుత్వం చెప్పినట్లు షెడ్లు నిర్మించుకోవడం తాము చేసిన తప్పా అంటూ పాడి రైతులు లబోదిబోమంటున్నారు. గోకులం షెడ్ల పెండింగ్ బిల్లులు విడుదల చేసి తమను ఆదుకోవాలని కోరుతున్నారు. కోర్టుకు వెళ్లినవారికి మాత్రమే జమ చేస్తారా.. లేక నిర్మాణం చేసుకున్న రైతులందరికీ బకాయిలు చెల్లిస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. కోర్టుకు వెళ్లిన రైతులకు సొమ్ము జమవుతున్నట్లు పశుసంవర్ధక శాఖ అధికారులు చెబుతున్నారు.

మినీ గోకులం షెడ్ల బిల్లుల బకాయిలు వెంటనే చెల్లించాలి
కె.శ్రీనివాస్, రైతుసంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి

రాష్ట్ర ప్రభుత్వం పాడి రైతులకు మినీగోకులం షెడ్ల బిల్లులు చెల్లించకపోవడం అన్యాయం. మూడేళ్లుగా పశుసంవర్ధక కార్యాలయాల చుట్టూ పాడి రైతులు కాళ్లరిగేలా తిరుగుతున్నారు. ప్రభుత్వం వైపు నుంచి సరైన స్పందన లేకపోవడం దారుణం. అప్పు చేసి రైతులు గోకులం షెడ్ల నిర్మాణం చేశారు. అప్పులకు వడ్డీలు పెరిగిపోతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం గోకులం షెడ్ల బిల్లులు వెంటనే చెల్లించాలి.


నినదిస్తున్న ఉద్యోగులు

నల్లబ్యాడ్జీలు ధరించి ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి - భీమవరం

ఎపి జెఎసి పిలుపు మేరకు స్థానిక కలెక్టరేట్ వద్ద కలెక్టరేట్ ఉద్యోగులు శుక్రవారం నిరసన తెలిపారు. వివిధ శాఖల్లో పని చేస్తున్న ఉద్యోగులంతా నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై నిరసన తెలిపారు. తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నినదించారు. సిపిఎస్ను రద్దు చేసి పాత విధానాన్ని అమల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. పిఆర్సి బకాయిలు ఇవ్వాలని, కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సర్వీసు క్రమబద్ధీకరించాలని, సచివాలయాల్లో ఉద్యోగులకు లక్ష్యాలను తొలగించి పని ఒత్తిడి తగ్గించాలని కోరారు. ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారమయ్యే వరకూ ఎపి జెఎసి ఆధ్వర్యంలో ఆందోళనలు సాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఎఒ వై.దుర్గాకిషోర్, సీనియర్ అసిస్టెంట్లు వివి.పెద్దిరాజు, పి.జగన్, కె.సురేష్, జి.కళ్యాణి, కె.కళ్యాణి, మురళీ, సూర్యకాంతం, గంగాధర్, ఉద్యోగులు పాల్గొన్నారు.

సిపిఎస్ రద్దు చేసి ఒపిఎస్ అమలు చేయాలి

ఉద్యోగ, ఉపాధ్యాయులకు మద్దతుగా వామపక్షాల ఆందోళన

ప్రజాశక్తి - భీమవరం

నినదిస్తున్న నేతలు

సిపిఎస్ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసి ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను తక్షణం పరిష్కరించాలని సిపిఎం, సిపిఐ డిమాండ్ చేశాయి. ఉద్యోగ, ఉపాధ్యాయులు పోరాటానికి మద్దతుగా స్థానిక ప్రకాశం చౌక్లో ఆ పార్టీల ఆధ్వర్యంలో శుక్రవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలపై నినదించి నిరసన తెలిపారు. సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులపై కక్షసాధింపు చర్యలు విడనాడాలని, లేనిపక్షంలో తగిన మూల్యం చెల్లించుకోకతప్పదని హెచ్చరించారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి, వారి న్యాయమైన డిమాండ్ల కోసం చేస్తున్న ఆందోళనలకు సిపిఎం, సిపిఐ పూర్తి మద్దతు తెలుపుతున్నాయన్నారు. సిఎం జగన్ నాడు ప్రతిపక్ష నేతగా చేసిన పాదయాత్రలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు అనేక హామీలిచ్చారని గుర్తు చేశారు. నాడు ఇచ్చిన హామీలు అమలు చేయకపోగా అమలు చేయాలని కోరిన ఉద్యోగులపై నిర్బంధం మోపడం సరికాదన్నారు. జీతాలు ఒకటో తేదీన చెల్లించే పరిస్థితి లేదన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు మాట్లాడుతూ కార్మికులు, కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు జెఎసిగా చేపట్టిన ఆందోళలకు సిపిఎం, సిపిఐ సంపూర్ణ మద్దతు తెలుపుతున్నామన్నారు. మంత్రుల సమక్షంలో ఇచ్చిన హామీలను కూడా అమలు చేయని దుస్థితి నెలకొందన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్వి.గోపాలన్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు, ఎం.సీతారాంప్రసాద్, ఎస్.పుష్పకుమారి, కార్యకర్తలు డేగ నాగు, కృష్ణ, మృత్యుంజయ, గంటి శ్రీను పాల్గొన్నారు.

12న ఉచిత గుండె వైద్య శిబిరం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

గుండె సంబంధిత వ్యాధులకు సంబంధించి అన్ని వయస్సుల వారికి ఉచిత వైద్య శిబిరాన్ని ఈ నెల 12వ తేదీ ఆదివారం ఉదయం మెంటేవారి తోటలోని అల్లూరి సీతారామరాజు, భగత్సింగ్ వైద్య సహాయ కేంద్రం (సుందరయ్య భవనం)లో నిర్వహిస్తున్నట్లు వసుధ ఫౌండేషన్ కన్వీనర్ ఇందుకూరి ప్రసాదరాజు, ఎస్ఎల్జి ప్రతినిధి వై.రణదివె, విజ్ఞాన కేంద్రం కన్వీనర్ వి.రాధాకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో హైదరాబాద్లోని మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ శ్రీ లక్ష్మీ గాయత్రి హాస్పిటల్కు చెందిన సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ జి.సుధీర్ రోగులను పరీక్షించి వైద్య సేవలు అందిస్తారన్నారు. మెడికల్ క్యాంపులో ఉచిత పరీక్షలు, శస్త్ర చికిత్సలకు అవసరమైన వైద్య సహాయం అందిస్తారని తెలిపారు. వైద్య శిబిరానికి వచ్చేవారు తమ పేరు నమోదుకు 6300180993, 9133339500 నెంబర్లకు ఫోన్ చేసి సంప్రదించవచ్చునన్నారు. శిబిరానికి వచ్చేవారు తాము ఉపయోగించే మందులను, డాక్టర్ ప్రిస్క్రిప్షన్ను తీసుకురావాలని కోరారు.

మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

టూరిజం అభివృద్ధికి ప్రణాళిక రూపొందించాలి

కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో వివిధ ప్రాంతాల్లో టూరిజం అభివృద్ధికి అవకాశాలను పరిశీలించి, ప్రణాళికలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్లో టూరిజం అభివృద్ధిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సన్రైజ్ రిసార్ట్ సిద్ధాంతం, బీచ్ రిసార్ట్ పేరుపాలెం, పెద్దమల్లం రిసార్ట్స్ ఆచంట మండలం, బోటింగ్ పాయింట్ అండ్ రెస్టారెంట్ వలందర్ రేవు, నరసాపురం, కాటన్ పార్క్, ఆకివీడుపై సమీక్షించారు. భీమవరంలో ఇరిగేషన్ కెనాల్లో బోటింగ్ ఏర్పాటుకు అవకాశాలను పరిశీలించాలని, పేరుపాలెం బీచ్లో వసతులు మెరుగుపర్చేందుకు ప్రణాళిక రూపొందించాలని సూచించారు. పేరుపాలెం, పెదమల్లంలో విద్యుత్ కనెక్షన్లు ఇచ్చే ఏర్పాట్లు చేయాలని సూచించారు. యలమంచిలి, ఆచంట మండలాల నుండి టూరిజం అభివృద్ధికి ప్రాంతాలను గుర్తించి ప్రతిపాదనలు అందజేయాలన్నారు. మొగల్తూరు వద్ద బ్యాక్ వాటర్లో బోటింగ్కు గల అవకాశాలను పరిశీలించాలని, మొగల్తూరులో నేషనల్ హైవే సమీపంలో టూరిజం ప్రాజెక్టు అభివృద్ధికి ప్రతిపాదనలు రూపొందించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఇన్ఛార్జి జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.సూర్యతేజ, డిఆర్ఒ కె.కృష్ణవేణి, ఆర్డిఅండ్ఇడి టూరిజం వి.స్వామినాయుడు, జిల్లా టూరిజం అధికారి మెహ్రాజ్, విద్యుత్ శాఖ ఇఇ ఫీర్ అహ్మద్ఖాన్, డిపిఒ ఎం.నాగలత, తహశీల్దార్లు పాల్గొన్నారు.

నీటి సరఫరాకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

జగనన్న కాలనీలకు శాశ్వత నీటి సరఫరా ఏర్పాట్లకు ప్రతిపాదనలను సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి పంచాయతీరాజ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్లో జలజీవన్ మిషన్ పనులపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఉగాది నాటికి పూర్తయ్యే కాలనీలకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. వేసవిలో తాగునీటి ఇబ్బంది ఎట్టి పరిస్థితుల్లో తలెత్తకూడదని, ముందుగానే ప్రణాళికాబద్ధంగా నీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలన్నారు. జల జీవన మిషన్ పనులను రానున్న రెండు నెలల్లో పూర్తి చేస్తే వేసవిలో నీటి ఎద్దడి లేకుండా ఉంటుందన్నారు. కొన్ని పంచాయతీల్లో తాగునీటిని ఫిల్టర్ చేయకుండానే విడుదల చేస్తున్నారని ఫిర్యాదులు అందుతున్నాయని, ఈ విధంగా చేసేవారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లాలో జలజీవన్ మిషన్ కింద సుమారు రూ.385 కోట్ల అంచనా వ్యయంతో 1,241 పనులను మంజూరు చేసినట్లు తెలిపారు. వీటిలో రెట్రో ఫిట్టింగ్, అగ్మెంటేషన్, నూరు శాతం తాగునీటి సదుపాయం పనులు ఉన్నాయన్నారు. ఇవికాక 727 జగనన్న లేఅవుట్లలో సుమారు రూ.135 కోట్ల అంచనా వ్యయంతో శాశ్వత నీటి సరఫరా పనులను చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఆర్డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారి ఎఎస్ఎ.రామస్వామి, డిపిఒ ఎం.నాగలత, హౌసింగ్ డిఇ పిచ్చయ్య, ఆర్డబ్ల్యూఎస్ డిఇలు బి.శ్రీనివాసరావు, కె.ధనానంద్, టి.శ్రీనివాస్, యు.రవి, ఎం.కృష్ణారావు, ఎఇలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రామభద్రం - భీమవరంలో నిరసన ప్రదర్శన

ప్రజాశక్తి - భీమవరం



నినదిస్తున్న ఉపాధ్యాయ నేతలు

ఉపాధ్యాయులు అనేక సమస్యల నడుమ బోధన సాగిస్తున్నారని, ఉపాధ్యాయ సమస్యలు తక్షణం పరిష్కరించాలని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎకెవి.రామభద్రం అన్నారు. భీమవరంలో యుటిఎఫ్ ఆధ్వర్యంలో విద్యాశాఖ, ప్రభుత్వ ఉపాధ్యాయులపై సస్పెన్షన్లు, వేధింపులకు నిరసనగా యుటిఎఫ్ కార్యాలయం నుంచి నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమల్లో ఉందని రోడ్లపై ఎటువంటి కార్యక్రమాలూ చేయడానికి వీల్లేదని పోలీసులు అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ప్రభుత్వం ఉపాధ్యాయులపై వేధింపులు ఆపాలని, మానసిక ఒత్తిడికి గురిచేయడం ఆపాలని, ఉపాధ్యాయుల ఆకస్మిక మరణాలకు గురి చేయొద్దని, పాఠశాలలో ఉపాధ్యాయ ఖాళీలను డిఎస్సి ద్వారా భర్తీ చేయాలని సమావేశం డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా రామభద్రం మాట్లాడుతూ ప్రభుత్వం జిఒ నెం.117 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఏకోపాధ్యాయ పాఠశాలలను మూసివేయొద్దన్నారు. ఈ సమావేశానికి జిల్లా సహాధ్యక్షులు జి.రాజశేఖర్ అధ్యక్షత వహించగా జిల్లా గౌరవాధ్యక్షులు మార్కండేయులు, జిల్లా కార్యదర్శులు సాయిరామ్, లక్ష్మీనారాయణ, కృష్ణంరాజు, ఏసుబాబు, శ్రీనుబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విచారణ నిర్వహిస్తున్న అధికారులు

డ్వాక్రా నిధుల గోల్మాల్పై కొనసాగిన విచారణ

ప్రజాశక్తి - పాలకోడేరు

గరగపర్రు గ్రామంలో డ్వాక్రా సంఘాల్లో నగదు అవకతవకలపై ఎపిఎం యు.రవికుమార్ శుక్రవారం రెండో రోజు విచారణ నిర్వహించారు. ఆదర్శ గ్రామ సంఘం పరిధిలో 33 స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. గ్రామ సంఘంలో నిల్వ ఉండాల్సిన సుమారు రూ.31 లక్షల నగదును సంబంధిత సిఎ, ఒబిలు స్వాహా చేశారంటూ ఇసి సభ్యురాలు పి.నాగవెంకటలక్ష్మి ఇటీవల అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఎపిఎం రవికుమార్, డిజిఎం కాంతారావు విచారణ చేపట్టారు. అయితే గ్రామ సంఘంలో ఉన్న మొత్తం స్వయం సహాయక సంఘాల సభ్యులు విచారణకు హాజరు కాలేదు. గ్రామ సంఘంలో ఉండాల్సిన మొత్తం రూ.31 లక్షల నగదులో ఎంత మేర అవకతవకలకు పాల్పడ్డారనే విషయం సంఘాల సభ్యులంతా విచారణకు హాజరైతే వెల్లడవుతుందని ఎపిఎం తెలిపారు. దీంతో విచారణ మరో రెండు, మూడు రోజులపాటు కొనసాగనుందని చెప్పారు.

తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

ఉండిలో చెక్పోస్టు ఏర్పాటు

ప్రజాశక్తి - ఉండి

ఎంఎల్సి ఎన్నికల నేపథ్యంలో ఉండి మెయిన్ సెంటర్లో ఆకివీడు రూరల్ సిఐ గీత రామకృష్ణ ఆధ్వర్యంలో చెక్పోస్ట్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ఎంఎల్సి ఎన్నికలు సజావుగా జరగాలని, డబ్బు పంపిణీ జరగకూడదనే ఉద్దేశంతో జిల్లా ఎస్పి యు.రవిప్రకాష్ ఆదేశాల మేరకు చెక్పోస్టును ఏర్పాటు చేశామన్నారు. కార్లను, అనుమానాస్పద వాహనాలను తనిఖీ చేస్తున్నామని, ప్రజలు సహకరించాలని కోరారు.

ఉపాధి పనులు చూపాలని వినతి

ప్రజాశక్తి - పెనుగొండ

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్ట ప్రకారం దరఖాస్తు చేసుకున్న 15 రోజుల్లో పనులు కల్పించాలని, లేకపోతే నిరుద్యోగ భృతి చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘం ఆధ్వర్యాన శుక్రవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యదర్శి నరసింహమూర్తికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సంఘం మండల కార్యదర్శి షేక్ పాదుషా మాట్లాడుతూ కార్మికులకు సకాలంలో ఉపాధి చూపించాలని, లేదంటే నిరుద్యోగ భృతి అయినా చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు పూతినీడి పద్మ, వ్యవసాయ కార్మికులు పాల్గొన్నారు.

విద్యాదాన్కు హేమశ్రీ ఎంపిక

ప్రజాశక్తి - మొగల్తూరు

విద్యాదాన్ స్కాలర్షిప్కు బండి ముత్యాలమ్మ జెడ్పి ఉన్నత పాఠశాల విద్యార్థిని వేండ్ర హేమశ్రీ ఎంపికైందని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఎం.బాలనాగమణి శుక్రవారం తెలిపారు. బెంగుళూరు సరోజిని దామోదర్ ఫౌండేషన్ వారు గత సంవత్సరం విద్యాదాన్ స్కాలర్షిప్ పొందేందుకు నిర్వహించిన పరీక్షలో హేమశ్రీ విజయం సాధించిందని తెలిపారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షలో 90 శాతం మార్కులు సాధించిందన్నారు, ఈ విద్యార్థికి ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో సంవత్సరానికి రూ.పది వేలు చొప్పున, ఇంజినీరింగ్లో సంవత్సరానికి రూ.20 వేల చొప్పున నాలుగు సంవత్సరాలు అందించనున్నారని తెలిపారు. విద్యార్థినిని సర్పంచి కోపనాతి పల్లయ్య, పిఎంసి ఛైర్మన్ నాగరాజు, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో మాజీ కౌన్సిలర్ మృతి

మరో నలుగురికి గాయాలు

ప్రజాశక్తి - పాలకొల్లు, పాలకొల్లు రూరల్

పాలకొల్లు మున్సిపల్ మాజీ కౌన్సిలర్ బుద్ధ చంద్రావతి (80) శుక్రవారం ఉదయం మండలంలోని శివదేవుని చిక్కాల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. కృష్ణా జిల్లాలో బంధువుల ఇంట్లో వివాహానికి హాజరై తిరిగి పాలకొల్లు వస్తుండగా కారు రోడ్డు పక్కనే ఉన్న చెట్టును ఢీకొనడంతో చంద్రావతి అక్కడికక్కడే మృతి చెందారు. కారు నడుపుతున్న ఆమె కుమారుడు రామకృష్ణ ప్రసాద్ (50), ఆమె భర్త, పాలకొల్లు కోకోనట్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు బుద్దా లక్ష్మీనరసింహారావు (85)లకు తీవ్ర గాయాలయ్యాయి. కుమార్తె సుధ (45), ఆమె కుమారుడు మోహన్(25) స్వల్పగాయాలతో పాలకొల్లులోని ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. నిద్రమత్తు కారణంగా ప్రమాదం జరిగి ఉండొచ్చని భావిస్తున్నారు. చంద్రావతి మృతదేహానికి పాలకొల్లు ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. చంద్రావతి మృతి పట్ల ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు, ఎంఎల్సి అంగర రామ్మోహన్, మున్సిపల్ మాజీ ఛైర్మన్ వల్లభు నారాయణమూర్తి, మాజీ కౌన్సిలర్లు పెచ్చెట్టి బాబు, జివి, గాదె వెంకన్న ప్రగాఢ సానుభూతి తెలిపారు. చంద్రావతి కుటుంబ సభ్యులను ఛాంబర్ అధ్యక్షులు కారుమూరి నరసింహారావు, నేతలు మాటూరి నరసింహమూర్తి, కొఠారి నాగేంద్రకుమార్, యాదదంరెడ్డి అప్పాజీ పరామర్శించారు. పాలకొల్లు రూరల్ సిఐ శ్రీనివాస్ కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదానికి గురైన కారు

చంద్రావతి (ఫైల్ఫొటో)

5న చలో ఢిల్లీ జయప్రదానికి ప్రచారం

ప్రజాశక్తి - తణుకు రూరల్



తణుకులో..

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా వ్యవసాయ కార్మికులు, కార్మికులు, కర్షకులు ఏప్రిల్ 5న నిర్వహించే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలో కార్మికుల కూడళ్లలో చలో ఢిల్లీ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రతాప్, సిఐటియు పట్టణ కార్యదర్శి గుబ్బల గోపీ మాట్లాడుతూ లేబర్ కోడ్లు రద్దు చేయాలని, పాత కార్మిక చట్టాలు అమలు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు టి.రామకష్ణ, నాగేశ్వరరావు, రాంబాబు, సాంబశివరావు, ప్రసాద్, శ్రీహరి, త్రిమూర్తులు పాల్గొన్నారు.

పెనుగొండ: ప్రజలపై భారాలు వేస్తూ, రైతులు, కార్మికుల పొట్టకొట్టి కార్పొరేట్ కంపెనీలకు ఊడిగం చేసే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ విధానాలను ప్రజలంతా వ్యతిరేకించాలని రైతు, కార్మిక సంఘాల రౌండ్టేబుల్ సమావేశం పిలుపునిచ్చింది. స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో సమావేశం సిఐటియు మండల నాయకులు కె.తులసి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం జిల్లా కార్యదర్శి ఎం.రామాంజనేయులు మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం రైతాంగ కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ ఇంటింటికి కరపత్రాలు పంచి జిల్లావ్యాప్తంగా ప్రచార జీపు యాత్రలు, మండల కేంద్రాల్లో మోటార్ సైకిల్ యాత్రలు నిర్వహిస్తున్నామన్నారు. ఏప్రిల్ 5న ఢిల్లీలో జరిగే ప్రజా ప్రదర్శనకు జిల్లా నుండి వేలాది మంది పాల్గొంటున్నారని తెలిపారు. ఈ సమావేశంలో సంఘాల నాయకులు ఎస్.వెంకటేశ్వరరావు, కె.సుబ్బరాజు, అనురాధా, ఉషాశ్రీ, లక్ష్మీకుమారి, షేక్ పాదుష, జి.సత్యనారాయణ, ఎన్.గంగారావు, పి.పద్మ, విజయ పాల్గొన్నారు.

పాలకోడేరు: కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలతో ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు శేషాపు ఆసిరియ్య అన్నారు. పెన్నాడ, గొరగనమూడి గ్రామాల్లో రైతాంగ సమస్యలపై తలపెట్టిన చలో ఢిల్లీకి తరలి రావాలని శుక్రవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఢిల్లీలో రైతులు ప్రాణత్యాగాలకు కూడా వెనకాడకుండా దీర్ఘకాలం ఉద్యమం చేసి హామీలను సాధించారని, వాటి అమలులో మోడీ ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల ఉపాధ్యక్షులు సుబ్బారావు, కె.కళ్యాణి, సిహెచ్.అప్పారావు, వెంకన్నబాబు, నాగలక్ష్మి, పాల్గొన్నారు.

పెనుగొండలో

యువత టిడిపికి వెన్నుదన్నుగా నిలవాలి

మాజీ మంత్రి పితాని సత్యనారాయణ

ప్రజాశక్తి - ఆచంట

యువకులంతా ముందుకొచ్చి చిత్తశుద్ధితో ప్రజాసేవ చేస్తున్న టిడిపికి వెన్నుదన్నుగా నిలవాలని మాజీ మంత్రి పితాని సత్యనారాయణ అన్నారు. పెదమల్లంలో గ్రామ కమిటీ సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలూ టిడిపి పట్ల ఎంతో ఆదరణ చూపుతున్నారని, ఈ సమయంలో కార్యకర్తలు మరింత శ్రమించి పార్టీ అఖండ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం కొడమంచిలిలో పార్టీ కార్యకర్తలతో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు కేతా మీరయ్య, నాయకులు బీర నరసింహమూర్తి, గణపతి నీడి రాంబాబు పాల్గొన్నారు.

వీరవాసరంలో మలేరియా అధికారి పర్యటన

ప్రజాశక్తి - వీరవాసరం

డ్రైడే ఫ్రైడే సందర్భంగా మలేరియా జిల్లా అసిస్టెంట్ అధికారి పి.శ్రీనివాసరావు శుక్రవారం వీరవాసరంలో పలు ప్రాంతాల్లో పర్యటించి పంచాయతీ వారికి తగు సూచనలు చేశారు. దోమల వల్ల వచ్చే వ్యాధుల పట్ల ప్రజలు అవగాహనతో ఉండాలన్నారు. మురుగు ప్రాంతాలను పరిశీలించి, దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి కె.భాస్కరరావు, సిహెచ్ఒ దేవదాసు, సూపర్‌వైజర్ జివివి. సత్యనారాయణ, హెల్త్ అసిస్టెంట్ మోహన్, ఎఎన్ఎం భవాని పాల్గొన్నారు.

చెరువు పూడికతీత పనుల పరిశీలన

ప్రజాశక్తి - మొగల్తూరు

ఉపాధి హామీలో భాగంగా అమృత్ సరోవర్ పథకంలో రామన్నపాలెంలో చేపట్టిన చెరువు పూడికతీత పనులను ఎంపిడిఒ ఆర్‌సి.ఆనంద్‌కుమార్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పలు సూచనలు చేశారు. ఆయన వెంట సర్పంచి బందిల ఎలీషా ఉన్నారు.

ఉపాధి కూలీలకు పేస్లిప్‌లు ఇవ్వాలి : వ్యకాస

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఉపాధి కూలీలకు పేస్లిప్పులు ఇవ్వాలని, పని ప్రదేశాల్లో మౌలిక వసతులు కల్పించాలని, 15 రోజులు మించకుండా వేతనాలివ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కండెల్లి సోమరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టింపాలెం గ్రామంలో ఆయన ఉపాధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధి కూలీలు పలు సమస్యలు ఆయన దృష్టికి తీసుకొచ్చినట్లు తెలిపారు. తక్షణం కూలీలకు వేతనాలు చెల్లించాలని, పే స్లిప్పులు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జాలిపర్తి సుబ్బలక్ష్మి, మల్లాది బుజ్జి, చాపల కృష్ణ, ఆరుగొల్లు రామలక్ష్మి, వేలంపాటి రాములు, గంటు ప్రసాద్, కాశిట్టి వెంకటేశ్వర్లు, గంటి భద్రం, దొడ్డిగర్ల చిట్టిబాబు, నాగ సత్యం, గణపవరం సత్యనారాయణ మాట్లాడారు.

ఆలయ పునఃనిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - కాళ్ల

కోమటిగుంట గ్రామదేవతలైన వెంకమ్మ, మహంకాళమ్మ అమ్మవార్ల ఆలయ పున:నిర్మాణానికి శుక్రవారం భూమి పూజ చేశారు. పానకాల నాగేశ్వరరావు సత్యవతి దంపతులు భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, దాతలు పాల్గొన్నారు.

ఇందిరకు పిహెచ్‌డి

ప్రజాశక్తి - ఆకివీడు

దుంపగడప వివి.గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రసాయన శాస్త్ర అధ్యాపకురాలిగా పనిచేస్తున్న అవిసె ఇందిరా పిహెచ్‌డి పట్టా పొందారు. 'లిక్విడ్ క్రోమెటోగ్రఫిక్ పద్ధతి అభివృద్ధి, ఔషధ మోతాదు రూపాల్లో కొన్ని ఔషధాల ధ్రువీకరణ' అనే అంశంపై ప్రొఫెసర్ ఎన్‌వై.శ్రీధర్ పర్యవేక్షణలో తిరుపతి శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం నుండి ఈ పట్టా పొందినట్టు ఇందిర తెలిపారు. ఈ సందర్భంగా ఆమెను కళాశాల ప్రిన్సిపల్ కె.సుజాత, సిబ్బంది శుక్రవారం కళాశాలలో ఘనంగా సత్కరించారు.

ఐదు గ్రామాల్లో ఫ్రైడే డ్రైడే

ప్రజాశక్తి - పాలకోడేరు

జ్వరాలను నియంత్రించాలంటే దోమల నివారణతో పాటు, పరిసరాల పరిశుభ్రత పాటించాలని పిహెచ్‌సి వైద్యాధికారి రంగనాయుడు అన్నారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమం గొరగనమూడి, పాలకోడేరు, విస్సాకోడేరు, పెన్నాడ, మోగల్లు గ్రామాల్లో శుక్రవారం వైద్య సిబ్బంది నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రంగం నాయుడు ఆదేశాలతో అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాల్లో బ్లీచింగ్ చల్లించారు. అదేవిధంగా ఆయా ప్రాంతాల ప్రజలకు దోమల నివారణ పై తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు శంకర్, అయ్యప్ప శ్రీనివాస్, నాగమణి, అమ్మాజీ, చండీరాణి, హెల్త్ అసిస్టెంట్లు, ఎఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

నులిపురుగు నివారణ మాత్రల పంపిణీపై సమీక్ష

పాలకోడేరు: జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 14వ తేదీన నిర్వహించే నులిపురుగు మాత్రల పంపిణీ కార్యక్రమం విజయవంతమయ్యేలా చర్యలు తీసుకోవాలని తహశీల్దార్ షేక్ హుస్సేన్, పిహెచ్‌సి వైద్యుడు డాక్టర్ రంగం నాయుడు అన్నారు. పాలకోడేరు పిహెచ్‌సిలో నులిపురుగుల మాత్రల పంపిణీపై మండల టాస్క్ ఫోర్స్ కమిటీ ఆధ్వర్యంలో డాక్టర్ రంగం నాయుడు అధ్యక్షతన సమీక్ష సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హులైన చిన్నారుల నుంచి హైస్కూల్, కళాశాల విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పూర్తిస్థాయిలో పంపిణీ చేయాలన్నారు ఈ మాత్రలు వేసేముందు హ్యాండ్ వాష్ గురించి తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ సూపరింటెండెంట్ శ్రీనివాసరాజు, డాక్టర్ స్వర్ణ నిరంజని, సిహెచ్ఒ సత్యనారాయణ, విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కాళ్ల : నులిపురుగుల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపిడిఒ జి.స్వాతి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. 1 నుంచి 19 సంవత్సరాల మధ్య వయసున్న పిల్లలందరూ ఈ నెల 14వ తేదీన ఆల్బెండజోల్ మందులు వేసుకోవాలని సూచించారు. తద్వారా నులిపురుగుల నివారణ సాధ్యపడుతుందని తెలిపారు. నూరుశాతం అర్హులకు ఆల్బెండజోల్ మందులు చేరేలా వైద్యులు సిబ్బంది కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యాధికారి గులాబ్ రాజ్ కుమార్ మాట్లాడారు.

మొగల్తూరు : మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు, జూనియర్ కళాశాల్లో విద్యార్థులకు నులి పురుగు నివారణ మాత్రలు పాఠశాల ప్రధానోపాధ్యాయులకు ఎంపిడిఒ ఆర్‌సి ఆనంద్‌కుమార్, పిహెచ్‌సి డాక్టర్ దివ్యభారతి అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌కు బానిస కావొద్దు

ప్రజాశక్తి - పాలకోడేరు

కుమదవల్లి గ్రామంలోని చైతన్య ఇంగ్లీష్ మీడియం స్కూల్లో పాఠశాల విద్యార్థులకు లైంగిక వేధింపులు, డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని పోలీస్ స్టేషన్ సిబ్బంది ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచి భూపతి రాజు వంశీకృష్ణంరాజు అధ్యక్షత వహించారు. ఎస్ఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ మధ్యకాలంలో యువత వ్యసనాలకు బానిసలవుతున్నారన్నారు చదువుకునే వయసులో చదువుకోవాలని ఎవరైనా లైంగిక వేధింపులకు పాల్పడితే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. డ్రగ్స్ తీసుకున్న అమ్మిన కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రిన్సిపల్ రామకృష్ణ, పిఒ సురేష్, శంకర్, మహిళా పోలీస్ బేబీ తదితర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్ఐ శ్రీనివాసరావు

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

నూరుశాతం ఉత్తీర్ణతే లక్ష్యం

పదో తరగతి పరీక్షలు ఏప్రిల్ 3వ తేదీ నుంచి మొదలుకానున్నాయి. ఉత్తమ ఫలితాల సాధనకు ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. నూరుశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ప్రణాళికను రూపొందించి ఆ దిశగా విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు. వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. పది విద్యార్థులకు ప్రీ పబ్లిక్ పరీక్షలు కూడా మొదలవ్వడంతో సబ్జెక్టుల వారీగా స్టడీ అవర్స్ పెట్టి చదివిస్తున్నారు.. విద్యార్థుల ఉత్తీర్ణతకు తీసుకుంటున్న చర్యలు, వారికి ఇస్తున్న సూచనలు, సలహాలపై పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ప్రజాశక్తికి వివరించారు..

ప్రతి విద్యార్థినీ పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నాం.. ★ ★ ★

ఆర్.ఇందిర, ప్రధానోపాధ్యాయిని, దొడ్డనపూడి హైస్కూల్, కాళ్ల మండలం

ఈ ఏడాది 52 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయనున్నారు. గత సంవత్సరం మా పాఠశాల కాళ్ల మండలంలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ సంవత్సరం విద్యార్థులను సబ్జెక్టు ఉపాధ్యాయులకు దత్తతిచ్చి వారు మంచి ఉత్తీర్ణత సాధించేలా కృషి చేస్తున్నాం. ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించడమే కాకుండా జిల్లా విద్యాశాఖ ఇచ్చిన సూచన మేరకు విద్యార్థులకు హోం టైం టేబుల్ ఇచ్చి ఇంటి వద్ద చదువుకునేటట్లు సంబంధిత ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు ఫోన్ ద్వారా పర్యవేక్షిస్తున్నారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాం.

ప్రణాళిక అవసరం.. ★ ★ ★

వేగేశ్న అనురాధ, ప్రధానోపాధ్యాయిని, ఏలూరుపాడు హైస్కూల్, కాళ్ల మండలం

విద్యార్థులు సొంతంగా ప్రణాళికను తయారు చేసుకోవాలి. మంచి మార్కులు రావాలంటే కనీసం ఆరు గంటల పాటు చదవాలి. గణితం, సైన్స్, ఆంగ్లం సబ్జెక్టులకు ఎక్కువ సమయం కేటాయించాలి. వీలైతే ఉదయం పూట వాటిని చదివితే మంచిది. తెలుగు, సాంఘిక శాస్త్రం, హిందీ సబ్జెక్టులకు కొంత తక్కువ సమయం వెచ్చించాలి. సైన్స్‌లో బొమ్మలు, సాంఘిక శాస్త్రంలో మ్యాప్ సాధన చేయాలి. ఒక్కొక్క సబ్జెక్టుకు కొంత సమయాన్ని కేటాయించుకోవాలి. ఖాళీ సమయంలో ప్రశ్నలు, సమాధానాలు చూడకుండా రాయాలి. దాని వల్ల తప్పులు సరిచేసుకోవచ్చు.

నూరుశాతం ఉత్తీర్ణతపై ప్రత్యేక శ్రద్ధ .. ★ ★ ★

కెఎస్.చంద్రశేఖర్, విస్సాకోడేరు హైస్కూల్ హెచ్ఎం, పాలకోడేరు మండలం

విద్యా వ్యవస్థలో పోటీతత్వం పెరిగిపోవడంతో విద్యార్థులు ఒత్తిడికి గురవుతున్నారు. ఈ నేపథ్యంలోనే తమ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులను సులువైన పద్ధతిలో పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నాం. ఈ ఏడాది బాలురు 44 మంది, బాలికలు 45 మొత్తం 84 మంది పరీక్షలు రాయనున్నారు. ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ తీసుకుంటున్నాం. విద్యార్థులు ఒత్తిడికి లోనవ్వకుండా పరీక్షలకు సన్నద్ధం చేయడంతో పాటు విద్యార్థులకు వచ్చిన అనుమానాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేస్తున్నాం. ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. తల్లిదండ్రుల కమిటీలతో సమావేశం ఏర్పాటు చేస్తూ వారిని అప్రమత్తం చేస్తూ విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నాం. ఈ ఏడాది నూరుశాతం ఉత్తీర్ణత సాధించే విధంగా ఉపాధ్యాయ బృందం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంది.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ.. ★ ★ ★

జి.శ్రీనివాస్, మోగల్లు హైస్కూల్ హెచ్ఎం, పాలకోడేరు మండలం

పదో తరగతి పరీక్షా ఫలితాల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించే విధంగా తమ పాఠశాల ఉపాధ్యాయ బృందం నిరంతరం కృషి చేస్తోంది. గతేడాది తమ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారు. మండలంలో ప్రథమ స్థానం సాధించాం. ఈ ఏడాది కూడా పూర్వవైభవాన్ని సాధించేందుకు ఉపాధ్యాయ బృందం విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేస్తోంది. ఒక్కో ఉపాధ్యాయుడు ఐదుగురు విద్యార్థులను దత్తత తీసుకోవడంతో పాటు వారి తల్లిదండ్రులతో ఫోన్లో మాట్లాడుతున్నారు. తల్లిదండ్రులను అప్రమత్తం చేసి విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. తమ పాఠశాలలో 115 మంది విద్యార్థులు పబ్లిక్ పరీక్షలకు హాజరుకానున్నారు. వారందరినీ గ్రేడ్లుగా విభజించాం. విద్యార్థుల చదువు సామర్థ్యాన్ని బట్టి విద్యా బోధన అందిస్తున్నాం. ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. నూరుశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం.

రోజూ ప్రత్యేక తరగతుల నిర్వహణ.. ★ ★ ★

వై.రామలక్ష్మి, గొల్లలకోడేరు హైస్కూల్ హెచ్ఎం, పాలకోడేరు మండలం

పది విద్యార్థులకు గతేడాది జులై నుంచి రోజూ ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. తమ పాఠశాలలో పదో తరగతి తెలుగు మీడియం 10 మంది, ఇంగ్లీష్ మీడియం 19 మంది విద్యార్థులు చదువుతున్నారు. వారి సామర్థ్యాన్ని బట్టి మూడు గ్రూపులుగా విభజించి విద్యాబోధన చేస్తున్నాం. ప్రతి విద్యార్థి పట్లా ఉపాధ్యాయ బృందం ప్రత్యేక శ్రద్ధ తీసుకొని సూచనలు, సలహాలు అందిస్తోంది. ప్రభుత్వం అందించిన మెటీరియల్, టైం టేబుల్ ప్రకారం విద్యనందిస్తున్నాం. సబ్జెక్టుల వారీగా సులువైన పద్ధతిలో విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో ఉపాధ్యాయులు విద్యాబోధన చేస్తున్నారు. ఈ ఏడాది నూరు శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా విద్యార్థులను సన్నద్ధం చేశాం.

ఆ పంచాయతీ కార్యదర్శి రూటే సపరేటు..!

లబోదిబోమంటున్న పాలకోడేరు ప్రజలు

ఎల్ఆర్ఎస్ అనుమతి ఉన్నా బిఎల్ఆర్ ఇవ్వని వైనం

కలెక్టర్‌కు ఫిర్యాదు చేసేందుకు బాధితులు సిద్ధం

ప్రజాశక్తి - పాలకోడేరు

అది జిల్లా కేంద్రానికి కూత వేటు దూరంలో ఉన్న మండల కేంద్రం. అక్కడ పంచాయతీ కార్యదర్శి రమాలీల రూటే సపరేటు. విధి నిర్వహణలో నిర్లక్ష్యపు ధోరణి, దురుసుగా ప్రవర్తనతో విసుగు చెందిన ఆ గ్రామ ప్రజలు జిల్లా అధికారులకు తమ గోడు చెప్పుకునేందుకు సిద్ధమయ్యారు. తమగోడు మండల స్థాయి అధికారులకు చెప్పినా ఫలితం లేకపోవడంతో బాధితులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమయ్యారు.

పాలకోడేరు పంచాయతీ కార్యదర్శి సిహెచ్‌వి.రమాలీల తీరుపై పలువురు గ్రామస్తులు, బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏదైనా సమస్యపై కార్యాలయానికి వెళ్తే కనీస మర్యాద ఇవ్వకుండా హీనంగా చూస్తున్నారని ఆ గ్రామస్తులు ఎం.రాజేశ్వరి, సిహెచ్.శ్యామలరావు, నరేంద్ర వర్మ, పి.వెంకటేశ్వరరావు, సుబ్బరాజు, భాస్కర్‌రాజు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో సర్వే నెంబర్ 9/1, 9/2, 9/3, 10/1, 10/2, 1డి, 1ఇ, 2బిలో గల స్థలాన్ని ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వారికి సుమారు రూ.27 లక్షలు చెల్లించి లేఅవుట్ అప్రూవల్ చేయించుకున్నారు. గతేడాది మే నెలలో ఈ అనుమతులు లభించాయి. ఈ స్థలంలో ఇళ్ల నిర్మాణానికి అనుమతుల కోసం పంచాయతీ కార్యదర్శి వద్దకు మూడు నెలలుగా తిరుగుతున్నారు. ప్లాన్స్ సబ్మిట్ చేసినా తమకు ఎందుకు అనుమతి ఇవ్వడం లేదని ఎన్నిసార్లు అడిగినా సమాధానం చెప్పట్లేదని వాపోయారు. పైగా తరచూ కార్యాలయానికి రావొద్దని హెచ్చరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఎంపిడిఒ మురళీ గంగాధర్ దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో బాధితులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసేందుకు సన్నద్ధమయ్యారు.



ఎల్ఆర్ఎస్ కట్టిన పత్రాలను చూపుతున్న బాధితులు

గ్రామంలో అక్రమ నిర్మాణాలు కోకొల్లలు

గ్రామంలో అక్రమ నిర్మాణాలు కోకొల్లలుగా సాగుతున్నాయి. వీటిపై కనీసం దృష్టి సారించని సంబంధిత పంచాయతీ కార్యదర్శి నిబంధనల ప్రకారం ప్రభుత్వానికి చలానా కట్టి అనుమతులు కోసం దరఖాస్తు చేసుకున్న వారిని ముప్పుతిప్పలు పెట్టడంపై అనేక ఆరోపణలు వినిపిస్తున్నాయి. పంచాయతీ కార్యదర్శి తీరుతో గ్రామంలో అనేక ఇబ్బందులు ఏర్పడ్డాయి . చివరకు మండల స్థాయి అధికారులకూ అవస్థలు తప్పడం లేదు. గ్రామంలో తేజ వాటర్ ప్లాంట్ సమీపంలో ఉన్న జగనన్న కాలనీకి వెళ్లే మార్గం ఇబ్బందుల్లో చిక్కుకోవడానికి ఆమె శైలే కారణమని ప్రచారం సాగుతోంది. జగనన్న కాలనీకి సమీపంలోని ఓ ఉద్యోగి ఇంటి నిర్మాణం చేసుకోవడంతోపాటు కాలనీకి తన సొంత స్థలాన్ని దారి నిమిత్తం ఇచ్చారు. అయితే ఇంటి నిర్మాణంలో పంచాయతీ నుంచి ఇబ్బందులు ఎదురవ్వడంతో విసుగు చెందిన సదరు ఉద్యోగి తన ఇంటి నిర్మాణాన్ని పూర్తిగా నిలుపుదల చేసి జగనన్న కాలనీకి వెళ్లే మార్గాన్ని మూసివేశారు. దీంతో మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి అధికారుల వరకు అంతా తలలు పట్టుకుంటున్నారు. ఇక గ్రామ సర్పంచి ఇంజేటి మరియమ్మ దళిత మహిళ కావడంతో ఆమె మాటకు కనీస విలువ ఇవ్వని పరిస్థితి. అయితే వివాదాలకు కేంద్ర బిందువు అవుతున్న పంచాయతీ కార్యదర్శికి రాజకీయ అండదండలు పుష్కలంగా ఉన్నాయనే ప్రచారంతో మండలస్థాయి అధికారులు ఆమెపై చర్యలకు వెనుకాడుతున్నారని తెలిసింది.

ఎల్ఆర్ఎస్ ఉంటే అనుమతులు ఇవ్వొచ్చు
రెడ్డియ్య, ఇఒపిఆర్‌డి

నిబంధనల ప్రకారం ఎల్ఆర్ఎస్ ఉంటే భవన నిర్మాణాలకు అనుమతి ఇవ్వొచ్చని పాలకోడేరు ఇఒపిఆర్‌డి రెడ్డియ్య తెలిపారు. ఎల్ఆర్ఎస్ అనుమతి ప్రకారం నామమాత్రపు రుసుము కట్టించుకుని పంచాయతీ నుంచి బిఎల్ఆర్ ఇవ్వొచ్చని స్పష్టం చేశారు. విధి నిర్వహణలో అలసత్వం వహించినా, నిర్లక్ష్యంగా వ్యవహరించినా సంబంధిత పంచాయతీ కార్యదర్శులపై చర్యలు తీసుకుంటామన్నారు.

పలువురిని గాయపర్చిన కోతి

పట్టుకున్న అధికారులు

ప్రజాశక్తి - పెనుగొండ

సిద్ధాంతం గ్రామంలో గురువారం రాత్రి కోతి స్వైర విహారం చేసి పలువురిని గాయపర్చింది. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు శుక్రవారం అధికారులు కోతిని పట్టించారు. గ్రామానికి చెందిన మండవల్లి రమణయ్యపై వానరం దాడి చేసి గాయపర్చింది. తణుకు తీసుకెళ్లి వైద్యం చేయించామని బంధువులు తెలిపారు. అలాగే ఆ ప్రాంతంలోనే నివాసముంటున్న చింతపల్లి రవీంద్రను గురువారం అర్ధరాత్రి వానరం దాడి చేసింది. దీంతో స్థానికులు పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేయగా సర్పంచి చింతపల్లి గనిరాజు (చంటి), కార్యదర్శి ఎస్‌వివి.నరసింహమూర్తి కోతిని పట్టించారు. దీంతో సిద్ధాంతం ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. అధికారులు వెంటనే స్పందించి వానరాన్ని పట్టుకోవడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

కోతిని పట్టించిన అధికారులు

సావిత్రిబాయి పూలేను ఆదర్శంగా తీసుకోవాలి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

మహిళలకు సమాజంలో సముచిత స్థానం రావాలని సంపూర్ణ విద్య నినాదంతో సావిత్రిబాయి పూలే ఉద్యమించారని సిఎస్ఎన్ కళాశాల కార్యదర్శి డాక్టర్ చీడే సత్యనారాయణ అన్నారు. శ్రీవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సిఎస్ఎన్ కళాశాలలో సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే వర్ధంతి, ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం కార్యక్రమాన్ని నిర్వహించారు. జూనియర్ సీనియర్ కళాశాల ప్రిన్సిపల్స్ డాక్టర్ సకుమళ్ల సత్యనారాయణ, ఎండి సలీమ్ ఖాన్, నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడారు. అనంతరం జూనియర్ కళాశాలలో ఉత్తమ అధ్యాపకులుగా విశిష్ట సేవలందిస్తున్న ఐ.ప్రదీప, ఎండి తోహిబా, కె.పవిత్రను సత్కరించారు. విద్యార్థులకు పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎమ్‌డి సరోజినీ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెనుమంట్ర : ప్రతి ఒక్కరూ సావిత్రీబాయి పూలేను ఆదర్శంగా తీసుకోవాలని బిసి మహాసభ జిల్లా అధ్యక్షులు అల్లాడ సూర్య భాస్కరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కుల వ్యవస్థ నిర్మూలనకు ఆమె కృషి చేశారని తెలిపారు. మహిళా విభాగాన్ని ఏర్పాటు చేసి కులాంతర వితంతు వివాహాలు జరిపించారని పేర్కొన్నారు.

పాలకొల్లు : సావిత్రిబాయి పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సిబ్బంది

పాలకొల్లు : ఎఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చరిత్ర, మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో జ్యోతి సావిత్రిబాయి పూలే వర్ధంతిని కళాశాల ప్రిన్సిపల్ టి.రాజరాజేశ్వరి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సావిత్రిబాయి పూలే చిత్రపటానికి నివాళులర్పించి ఆమె చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో చరిత్ర అధ్యాపకులు కె.పార్థసారథి, బి.రామలక్ష్మి, అర్థశాస్త్ర, అధ్యాపకురాలు వి.విజయలక్ష్మి పాల్గొన్నారు.

మొగల్తూరు : స్త్రీ విద్యా అభ్యున్నతికి కృషి చేసిన మహోన్నత వ్యక్తి సావిత్రిబాయి పూలే అని బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు కుక్కల సత్యనారాయణ అన్నారు. శుక్రవారం పెంకెవారి కాంప్లెక్స్‌లో సావిత్రిబాయి పూలే వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహోన్నత వ్యక్తి సావిత్రిబాయి పూలే అని కొనియాడారు. అనంతరం ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమాల్లో కండిబోయిన సుబ్రహ్మణ్యం, పెంకి చంపేశ్వరరావు, రాయుడు కృష్ణారావు, మోటుపల్లి ముత్యాలరావు పాల్గొన్నారు.

IN THE HON'BLE COURT OF THE II ADDL. SENIOR CIVIL JUDGE AT: VISAKHAPATNAM
I.P. 7/2022
Between:
Talasila Rohini Kumar ...Petitioner
And:
Y. Venkateswara Rao & others ...Respondents
NOTICE
To,
Respondent No.9:
Nalluri Lakshmi Narasimha, S/o. Krishna, age 45 years, Farmer, R/at D.No.1-87, Moritappa, Dharborevu Post, Narsapur, West Godavari District-534275.
Please take notice that the above named petitioner has instituted the above I.P against the respondents and the matter stands posted to **15-03-2023** for your appearance. You are hereby required to appear before the Hon'ble Court either in person or through duly instructed Advocate on **15-03-2023 at 10:30 A.M** in the above Court to answer all material questions, failing which the matter will be heard and determined in your absence ex-parte as per law.
(By Order of the Hon'ble Court)
YERRA REVATHI, Advocate
Visakhapatnam. **Cell: 79893 44376**

14న చలో మచిలీపట్నంను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఈ నెల 14వ తేదీన చలో మచిలీపట్నం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జనసేన రాష్ట్ర రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యులు, నియోజకవర్గ ఇన్‌ఛార్జి చేగొండి సూర్య ప్రకాష్ పిలుపునిచ్చారు. శుక్రవారం మార్టేరులో నిర్వహించిన జనసేన నియోజకవర్గ విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశం మండల అధ్యక్షుడు కోయే వెంకట కార్తీక్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సూర్య ప్రకాష్ వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. మండలంలోని జనసైనికులు, వీర మహిళలు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పెనుగొండ మండల అధ్యక్షులు కొండవీటి శ్రీనివాస్, ఆచంట మండల అధ్యక్షులు జవ్వాది బాలాజీ, జిల్లా ఉపాధ్యక్షులు వెంగలదాసు దానయ్య, జిల్లా సంయుక్త కార్యదర్శి షేక్ ముంతాజ్ బేగం పాల్గొన్నారు.

17న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

ఈ నెల 17వ తేదీ మధ్యాహ్నం మూడు గంటల నుంచి ఎంపిపి చిట్టూరి కనకలక్ష్మి అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు పాలకొల్లు మండల విస్తరణాధికారి సంఘాని వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ సమావేశం మండల ప్రజా పరిషత్ కేంద్రంలోని జిఎంసి బాలయోగి సమావేశ మందిరంలో నిర్వహిస్తామని చెప్పారు. సభ్యులందరూ ఈ సమావేశానికి తప్పక హాజరు కావాలని కోరారు.

మహిళలు ఆర్థిక పరిపుష్టి సాధించాలి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

మహిళలు ఆర్థికంగా తమ కాళ్లపై తాము నిలబడి, మరి కొంతమందికి మార్గదర్శంగా ఉండాలని లయన్స్ క్లబ్ జిల్లా క్యాబినెట్ సెక్రటరీ లయన్ నూకల నాగ మల్లేశ్వరరావు అన్నారు. శుక్రవారం స్థానిక పేరిచర్ల ఫౌండేషన్ కార్యాలయంలో తాడేపల్లిగూడెం డైమండ్స్ లయన్స్ క్లబ్ అడ్మిన్ లయన్ పేరిచర్ల మురళీ కృష్ణంరాజు అధ్యక్షతన జరిగిన సేవా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన విచ్చేశారు. లయన్ పేరిచర్ల మురళీ కృష్ణంరాజు మాట్లాడుతూ ఆర్‌సిఆర్ సూర్యనారాయణ రాజు సూచనలు మేరకు మహిళలకు డైమండ్స్ లయన్స్ క్లబ్ తరుపున గవర్నర్ పంకజాక్షన్ టెలిఫోన్ డైరెక్టరీలు అందజేశారు. అనంతరం మహిళ దాక్షాయనికి ఉచితంగా కుట్టు మిషన్ అందజేశారు. లయన్ కమల మాట్లాడుతూ సావిత్రి బాయి పూలే వర్ధంతి సందర్భంగా ఆమెను గుర్తు చేసుకుంటూ ఈ సేవా కార్యక్రమం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో లయన్స్ గ్రంధి లక్ష్మి సోనామ్, లలియో నందిని, యర్రా ఆంజనేయస్వామి, కుందుం వెంకటేశ్వరరావు, పేరిచర్ల ఫౌండేషన్ డైరెక్టర్ ముదునూరి శివరామ రాజు, రెడ్డి రాజు పాల్గొన్నారు.

వాహనదారులు హెల్మెట్ ధరించాలి : ఎస్ఐ

పాలకోడేరు : ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని పాలకోడేరు ఎస్ఐ శ్రీనివాసరావు అన్నారు. గొల్లలకోడేరులో శుక్రవారం హెల్మెట్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ద్విచక్ర వాహనాలను నిలుపుదల చేసి వాహనదారులతో హెల్మెట్లు కొనుగోలు చేయించి అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనంపై ప్రయాణం చేసేటప్పుడు హెల్మెట్ తప్పనిసరి అన్నారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ వినియోగించాలని, లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఎస్ఐ వెంట సిబ్బంది ఉన్నారు.

డాక్యుమెంట్ పడిపోయినది
మామిడిపల్లి వి.యస్.ఆర్.కె.యస్.వి. ప్రసాద్, తండ్రి: సత్యనారాయణ అను నాయొక్క దస్తావేజు పడిపోయినది. ఇంటి నుండి తణుకు జిరాక్స్ సెంటర్‌కు వెళుతుండగ నాయొక్క దస్తావేజు కనిపించలేదు. దస్తావేజు నెం: 20g Book No. 4/2005 గల దస్తావేజు పడిపోయినది. ఎవరికైన దొరికిన ఎడల ఈక్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.
మామిడిపల్లి
వి.యస్.ఆర్.కె.యస్.వి.ప్రసాద్
తండ్రి: సత్యనారాయణ, డోర్ నెం: 1-17, పైడిపర్రు, తణుకు మండలం, ప॥గో॥జిల్లా, పిన్ : 534211. సెల్: 99668 63685

IN THE COURT OF THE ADDL. SENIOR CIVIL JUDGE, ELURU
E.P.10/2019, O.S.55/2013
Between:
వేల్పుల వెంకటేశ్వరరావు ...D.Hr
And
దేవు నాగరాజు, S/o.రామారావు, విద్యుత్ నగర్ కాలనీ, వట్లూరు, పెదపాడు మండలం. ...J.Dr
వేలము నోటీసు
పై నంబరు దావా గ్రంథములోని D.Hr తన బాకీని వసూలు చేసుకునే నిమిత్తం దాఖలు చేసిన ఈ E.P గ్రంథములో దిగువ షెడ్యూలు దాఖలా స్థిరాస్థిని **ది.27-03-2023 తేదీన ఉదయం 10.30 గం॥లకు పై కోర్టు వారి ఎదుట బహిరంగముగా వేలం వేయ బడును.** వేలంలో పాడుకొనదలచిన వారు ఉదయం 10.30 గం.లకు ఆధార్ కార్డులతో వచ్చి వేలంలో పాల్గొనదలచినదిగా కోర్టు వారు ఆర్డరు వేసియున్నారు.
షెడ్యూలు: Landed property in an extent of Ac.0-10 cts covered by R.S.No.114/3 situated in kolaparru Grama panchayat, pedapadu mandalam, Eluru SRO, W.G.Dt., within the following boundaries.
EAST: Land of Kadaganchi Lakshmi
SOUTH: Land of Balda Manikyamma
WEST: Land of Ramini China Venkateswara Rao, **NORTH:** Land of Vare Veera Swamy.
An extent of Ac.0-10 cts of land, with all the easementary rights.
D.Hr Value - more than five lakhs
Amin Value - Rs.2,33,000/-
Eluru **S.BRAHMAM,** Advocate,
Dt.10-03-2023 Eluru. Cell: 94929 32214